

# భవానీద్వీపం

–వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 62 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

'వారోం మీంట్జేఎట్' ( ఆయన ఎందుకు గంభీరంగా ఉన్నాడు?) అని లోగొంతుకతో అడిగాడు అంబ్రాస్. 'ఇన్ హ దఖ్ఖ బ్రజోంక' (ఆలోచనలలో మునిగిపోయాడు) అని సమాధానమిచ్చాడు దామోదరశర్మ. మళ్ళీ తనే అన్నాడు 'నీట సీరియస్' (తీవ్రమైన గంభీరత ఏమీ కాదు) అతిథితో, దామోదరశర్మతో పొడిపొడిగా మాట్లాడుతున్న కృష్ణరాయల మనసు అక్కన్న మాదన్నల విషాదగాథ చుట్టూ పదే పదే తిరుగుతున్నది.

పన్నెండు సంవత్సరాల కాలంలో కేవలం ఒక సామాన్య గుమాస్తాల స్థాయినుండి గోల్కొండ సామ్రాజ్య సైన్యాధికారిగా, ప్రధానమంత్రిగా కెరటాలలాగా ఉవ్వెత్తున ఎగిశారు. తానీషా తరువాత తానీషాలుగా వెలిగారు. తమ నిష్కళంకమైన ప్రభుభక్తితో, మేధస్సుతో తానీషాకు అత్యంత ఆప్తులుగా మెలిగారు.

తమ మంత్రాంగంతో, రాజనీతి చతురతతో ఢిల్లీ పాదుషాకు అందని పండుగా గోల్కొండ సామ్రాజ్యాన్ని మలిచారు. నొప్పించక, నొచ్చుకోక, కాలుదువ్వక, కాళ్ళు పట్టుకోకుండా సమయానుకూలంగా సంధి, సంప్రదింపులతో గోల్కొండ సామ్రాజ్యాన్ని కాపాడారు.

జనానాకు కూడా చెప్పని రహస్యాలను వారితో పంచుకున్నాడు తానీషా. బహుశా అదే తానీషా అంతఃపుర సాహిబాలకు కంటగింపు అయ్యింది. దానికి తానీషాకు వెన్నుపోటు పొడిచేవారి మంత్రాంగం తోడయ్యింది.

అసూయాపరుల కుట్ర జతపడింది. ఏ గోల్కొండ రాజవీధులలో బంగారు పల్లకీలో ఊరేగారో అక్కడే పల్లకీనుండి క్రిందికి లాగి వారి తలలు నరికేశారు. వారి మొండాలు గోల్కొండ కోట గోడలకు వ్రేల్లాడాయి.వారి తలలతో ఔరంగజేబ్ మదపుటేనుగులు బంతులాడుకున్నాయి. అలా వినోదించి, చివరికి వారి తలలను తన ఏనుగులతో తొక్కించి తన కసి తీర్చుకున్నాడు ఔరంగజేబు.

సరిగ్గా పది సంవత్సరాల క్రితం అపర హనుమావతారుడు సమర్థ రాముడు తనను కరుణించడానికి తన ఇంటికి వచ్చినప్పటి సంఘటన గుర్తుకు వచ్చింది కృష్ణరాయలకు. అక్కన్న మాదన్నలు సమర్థ రాముడిని దర్శించుకోవడంకోసం ముక్తివరం వచ్చారు. తిరిగివెళ్ళేప్పుడు జరిగిన సంభాషణ పదే పదే చెవులలో మారుమ్రోగుతున్నది కృష్ణరాయలకు.

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

'పాలితులకు మత, వర్ణ విచక్షణ ఉండవచ్చునేమో గానీ, పాలకులకు ఉండకూడదు మాధోబా! అధికారములో ఉన్నవాడు అందరినీ సమానంగా ఆదరించాలి. అప్పుడే అందరి ఆమోదాన్నీ పొందుతాడు. గోల్కొండ సామ్రాజ్యంలో మొదటినుండీ సేవజేస్తున్నవారిని దూరంచేయకండి. ఆశ్రిత పక్షపాతాన్ని చూపకండి.

ఉన్నతస్థానంలో ఉన్నవారు చేసే మంచీ చెడూ రెండూ వందలరెట్లుగా కనిపిస్తాయి'

'సహజశత్రువుల చిన్ని దోషాలకు పెద్ద శిక్షలు వేయకండి. వారు పరివర్తన చెంది మృదువుగా మెలగడానికి అవకాశాన్ని ఇవ్వండి. సన్నిహితుల దోషాలను విస్మరించకండి. అవకాశము వచ్చేవరకే నా అన్నవారు. అవకాశము దొరికితే ఎవరూ నీవారు కారు, నిన్ను ఉపేక్షించరు! బలమైన శత్రువులను అడ్డుకోవడానికి భుజబలం, అధికారబలం మాత్రమే సరిపోవు, బుద్ధిబలం, నేర్పు కావాలి' మరొక్కమారు గంభీరంగా హితవు పలికాడు సమర్థరాముడు!

' శత్రువులు ఎంతటి బలవంతులైనా కావచ్చుగాక. అందరూ ఏకమై రావచ్చుగాక. మా తలలు తెగిపడినా సరే, మీ దాసులు..' అని అక్కన్న పలుకుతుండగనే ద్వారముబయట ఎవరో పెద్దగా తుమ్మిన ధ్వని వినబడింది.

' జయ జయ రఘువీర సమర్థా!' అని పెద్దగా స్మరించాడు సమర్థ రాముడు.

' ... మీ దాసులు భయపడరు, మీ కార్యరంగమునుండి వెనుదిరుగరు' తన పలుకులను కొనసాగించాడు అక్కన్న.

మౌనం వహించి ఏదో ఆలోచనలో మునిగిపోయాడు సమర్థరాముడు. ఆయన భ్రుకుటి ముడిపడింది. ఎల్లపుడూ చిరునవ్వులు చిందే ఆయన ముఖం ఎందుకో కలవరపాటునుసూచించింది.

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

కలవరపాటుతో దశాబ్ద కాలపు జ్ఞాపకాలనుండి ప్రస్తుతానికి వచ్చాడు కృష్ణరాయలు. బాధగా తల ఊపుతూ నిట్టూర్చాడు. ఆనాడే సమర్థ రాముడు అక్కన్న మాదన్నల భవిష్యత్తును దర్శించాడు అనిపించింది కృష్ణరాయలకు. ఆయన కారణజన్ముడు. భూత, భవిష్య, వర్తమానాలను సమగ్రంగా తెలుసుకున్న కాలజ్ఞాని. ఎన్నెన్ని జన్మల రహస్యాలను, వేల సంవత్సరాల చరిత్రను, జన్మజన్మల బంధాల గాథలను భవానీద్వీపం వేదికకగా తనకు దర్శింప చేసింది గుర్తుకొచ్చి ఒళ్ళు పులకరించింది కృష్ణరాయలకు.

ఒక్కసారిగా హృదయం తేలిక పడినట్టు అనిపించింది సమర్థ రాముడిని గుర్తు చేసుకోవడంతో.

'మన్నించండి! మిమ్మల్ని కూర్చోబెట్టి నేనేదో ఆలోచనలలో మునిగిపోయాను' అన్నాడు అంబ్రాస్ వైపు నొచ్చుకున్నట్లుగా చూస్తూ. ఆ మాటలను పూర్తిగా అర్థం చేసుకోనప్పటికీ భావాన్ని అర్థం చేసుకున్నాడు అతడు. తేలికగా నవ్వేస్తూ 'గీన్ ప్రోబ్లీం' అన్నాడు.

'మీరు మాట తప్పారు. సకుటుంబంగా మా అమ్మవారిని దర్శించుకుంటామన్నారు. ఒక్కరే వచ్చారు'

అన్నాడు కృష్ణరాయలు నేరారోపణ చేస్తున్నట్లుగా అంబ్రాస్ వైపు చూస్తూ. ' జె హోప్ట్ జె బెలోఫ్ట్ నీట్ నాగేకొమేన్' అంటూ అనువదించి ఆ మాటలను చెప్పాడు దామోదరశర్మ.

పెద్దగా నవ్వుతూ 'నీ..నీ..హారె మాయిస్టైట్ ఈజ్ ఒండర్ వే' అన్నాడు సంజాయిషీ యిస్తున్నట్లుగా నవ్వుతూ.

'మాట తప్పలేదు. అమ్మగారు వెనుక వస్తున్నారు అంటున్నారు' అని మళ్ళీ విడమరిచి చెప్పాడు దామోదరశర్మ.

ఆరోజునుండి శరన్నవరాత్రులు ప్రారంభం. వారం రోజుల క్రితంనుండే ముక్తివరంలో సందడి మొదలైంది.కృష్ణరాయల ఆధ్వర్యంలో ముక్తివరంలో జరిగే దుర్గానవరాత్రుల తిరునాళ్ళు గోల్కొండ సామ్రాజ్యంలో పేరుపొందిన ఉత్సవాలలో ప్రముఖమైనవి. దూర దూర ప్రాంతాలనుండి వర్తకులు, భక్తులు పోటెత్తుతారు.

మున్నేటిలో మునకలేసి, ఆ పొద్దున స్థంభాద్రి నరసింహుడిని దర్శించుకుని, ఈ పొద్దున ముక్తివరం అమ్మవారి పందిరిలో అమ్మను సేవించుకుని ఇక తిరునాళ్ళ సంబరాలలో మునకలేస్తారు వేలాది జానపదులు.

మున్నేటికి రెండుపక్కలా వందల సంఖ్యలో అంగళ్లు కొలువుతీరుతాయి. రత్నాల అంగళ్లు మొదలుకొని రాతి పనిముట్లదాకా దొరకని వస్తువు అంటూ ఉండదు. పాము కుబుసంలా మెరిసే పల్చని పట్టు వస్త్రాలనుండి పాములనాడించే వాళ్ళ నాగాస్వరాల దాకా పల్లె జనాలను నోళ్ళు వెళ్ళబెట్టి చూసేలా వుంటాయి. వినోదాలు, వింతలు, సరసాలు, సాముగరిడీలు ఆ పదిరోజులపాటు ప్రతి రోజూ పండగే.

గత కొన్ని సంవత్సరాలుగా నాగులవంచ డచ్చివారి అంగడి కూడా ఉంటున్నది తిరునాళ్ళలో. నాగులవంచ నేతగాళ్ళ నీలి అద్దకం వస్త్రాలు నిముషాలలో గుట్టలు గుట్టలు అమ్ముడు పోతుంటాయి. నాగులవంచ డచ్చివారి ప్రతినిధిగా మొదటిసారి కృష్ణరాయల వద్దకు వచ్చాడు అంబ్రాస్. తిరునాళ్ళలో అంగడి పెట్టుకోవడం కోసం అనుమతిని అడగడానికి దామోదరశర్మను వెంటబెట్టుకొచ్చాడు. ఆనాటినుండి కృష్ణరాయల కుటుంబంతో సాన్నిహిత్యం పెరిగింది అతడి కుటుంబానికి.

అంబ్రాస్ దంపతులకు ఒక్కడే కొడుకు. ఆ బుడతడి పేరు ఇర్మిన్. పదమూడేళ్ళ వయసుంటుంది వాడికి. వాడు సార్థక నామధేయుడు. ఇర్మిన్ అంటే డచ్చివారి దేవుళ్లలో యుద్ధానికి, శౌర్యానికి, పరాక్రమానికి ప్రతీక అని చెప్పాడు అంబ్రాస్ ఒకసారి. డచ్చివారి యుద్ధక్రీడ 'మువై'లో ఆరితేరినవాడు ఆ పిల్లాడు.

గత రెండు సంవత్సరాలుగా ముక్తివరం అమ్మవారి తిరునాళ్ళల్లో కుస్తీ పోటీలలో ప్రథమ బహుమతిగా దుర్గాదేవి వెండి ప్రతిమను కైవసం చేసుకుంటున్నాడు వాడు.

రెండు పిడికిళ్ళు, రెండు మోచేతులు, రెండు మోకాళ్ళు, రెండు మీగాళ్ళు అనే ఎనిమిది అంగాలతో శత్రువు మీద దాడి చేయడం, శత్రువుల దాడినుండి రక్షించుకోవడం అనే యుద్ధ విద్య 'మువై'. గత సంవత్సరం బరిసెలు ధరించిన ముగ్గురు ఎనుబోతుల్లాంటి వాళ్ళను గోదాలో పరుగులు పెట్టించి లొంగదీసి వందలాది ప్రజల జేజేలు పొందాడు వాడు. బరిసె లాంటి గట్టి ఆయుధం చేతిలో వుంటే పదిమంది పోటు మగాళ్ళను పొర్లించి కొట్టగలడు. ముక్తివరం తిరునాళ్లకు ప్రత్యేక ఆకర్షణ అయినాడు ఇర్మిన్.

పట్టు పరదాల మాటున వెండి పట్టీలు పలకరింపుగా మోగాయి. పండువెన్నెల లాంటి నవ్వు చిమ్ముతూ

దానిమ్మ గింజలలాంటి పళ్ళు తళుక్కున మెరిశాయి. నిండు పున్నమి చంద్రుడిలాంటి ముద్దుల ముఖం ఒకటి పరదాను తొలిగించి కనిపించింది. చెవులకున్న లోలకులు ఊగేలా తల తిప్పుతూ 'క్వాం హాయ్ నీ..'

(తను రాలేదా) అని డచ్చిలో కొంటెగా ప్రశ్నించింది పదేళ్ళ పసిడికూన. ఆ బంగారానికి తల్లిదండ్రులు పెట్టిన పేరు లలిత. ఆ పేరు చిన్నగుందని 'లలితా పరాభట్టారికా మహా త్రిపుర సుందరి' అని తన పేరు మార్చుకుంది. ఆ బంగారుతల్లి కృష్ణరాయల గారాల కూతురు.

పదేళ్ళక్రితం సమర్థరాముడు గోల్కొండ సామ్రాజ్య పర్యటన ముగించుకుని వెళుతూ కృష్ణరాయల దంపతులను ఆశీర్వదించాడు. 'మీకు వంశోద్ధారకురాలిగా సాక్షాత్తూ అమ్మవారే పుడుతుంది' అన్నాడు చిరునవ్వుతో. 'లలిత' అని పేరు పెట్టుకోండి అనికూడా ఆయనే అనుగ్రహించాడు. కృష్ణరాయలకు కొద్దిగా ఆశ్చర్యం కలిగింది. మహా రామభక్తుడు, హనుమ ఉపాసకుడు ఐన సమర్థుడు 'సీత' అని పేరు పెట్టుకోమ్మంటాడు అనుకున్నాడు తన మనసులో. చిలిపిగా నవ్వుతూ 'సీత అంటే లలితయే కృష్ణోబా! జగజ్జనని అవతారాలలో సీతమ్మ కూడా ఒకతి' అన్నాడు.

ఏదైనా సరే, ఒక్కసారి విన్నా, చూసినా యిట్టే పట్టేసుకునే ఆ చిన్నదానికి ఇర్మిన్ ప్రాణ స్నేహితుడైనాడు. డచ్చి భాష వాడినుంచి పట్టుకుంటున్నది, వాడికి తెలుగు ముట్టచెబుతున్నది లలిత.

చిరునవ్వుతో లేచి నిలుచుని 'ఇక్ గ్రోటే యు క్లేనె ప్రిన్స్' (మీకు నమస్సులు యువరాణీ) అని చిలిపిగా గౌరవ వందనం చేశాడు అంబ్రాస్. శిల్పంలా రెండుచేతులూ జోడించి, తండ్రి ఒడిలో చేరి చిరునవ్వులు చిందించింది చిన్నారి లలిత. గుఱ్ఱపు డెక్కల చప్పుడు, సన్నని సకిలింతలు వినిపించాయి. నగిషీలు చెక్కిన మెరిసిపోతున్న గుఱ్ఱపు బగ్గీ ఒకటి వచ్చి ఆగింది ప్రహరీ ద్వారం వద్ద. ఆగీ ఆగకముందే చెంగున బయటకు దూకాడు బంగారు కడ్డీలాంటి బాలకుడు. 'ఇర్మిన్! వీస్ ఊప్లేటేండ్..వీస్ ఊచిజ్జ' అని జాగ్రత్తలు చెబుతూ నెమ్మదిగా గుఱ్ఱపు బగ్గీ దిగింది తేనెలో ముంచిన పాలమీగడ లాంటి అందాల రాశి. ఆమె పేరు 'లేడీ హాలె'. ఆమె అంబ్రాస్ భార్య, ఇర్మిన్ తల్లి.

(కొనసాగింపు వచ్చే సంచికలో...)

COMMENTS